విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి



విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న లైన్‌మన్



శివారెడ్డి మృతదేహం

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామ సమీపంలో సోమవారం విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై విద్యుత్ లైన్‌మన్ మృతి చెందాడు. వేంపల్లె మండలం నందిపల్లె గ్రామానికి చెందిన శివారెడ్డి (38) పులివెందులలో విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా ఓ రైతు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసేందుకు వెళ్లి అక్కడ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వనిపెంట గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం

మైదుకూరు : మైదుకూరు మండలం వనిపెంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల నిత్యం ఏదో ఒక సమస్యతో వార్తలకెక్కుతోంది. కొద్ది రోజుల క్రితం సరిగా చదవకపోవడం, శుభ్రంగా ఉండటం లేదనే కారణంతో ఓ విద్యార్థినికి ప్రిన్సిపాల్ టీసీ ఇచ్చి పంపిన సంఘటన వివాదాస్పదమైంది. తాజాగా సోమవారం పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న డి.జ్యోతి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వనిపెంటకు చెందిన డి. జ్యోతి 8 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై గురుకుల పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఉపాధ్యాయిని జ్యోతి ప్రిన్సిపాల్ నిర్మల ఛాంబర్‌లోకి వెళ్లి టీచింగ్ డైరీ (వర్క్ డన్ స్టేట్‌మెంట్) అందజేశారు. కొద్ది సేపటికి పాఠశాలలోని ఓ గదిలో ఒక్క సారిగా తూలి కింద పడిపోయిన ఆమె అక్కడున్న స్టాఫ్ నర్స్‌తో తాను నిద్ర మాత్రలు మింగానని చెప్పారు. దాంతో అక్కడి సిబ్బంది, కొందరు ఉపాధ్యాయులు ఆమెకు ఉప్పు కలిపిన నీటిని తాగించారు. అంతలోనే పాఠశాల వద్దకు చేరుకున్న ఉపాధ్యాయురాలు భర్త సుధీర్ ఆటోలో ఆమెను తీసుకుని వనిపెంటలోని ఓ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. తన చావుకు ప్రిన్సిపాల్ నిర్మల వేధింపులే కారణమంటూ ఉపాధ్యాయిని జ్యోతి రాసినట్టుగా సోమవారం సాయంత్రం 4 పేజీల సూసైడ్ నోట్ వెలుగు చూసింది. పాఠశాలలో 8 ఏళ్లుగా తాను ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పనిచేస్తున్నట్టు ఉపాధ్యాయిని జ్యోతి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాల తెరిచినప్పటి నుండి ప్రిన్సిపాల్ తనను వేధిస్తున్నారని ఆరోపించారు. తనకు మూడు నెలల పాప ఉన్నా రోజూ అన్ని క్లాసులకు హాజరై పాఠాలు చెబుతున్నానని పేర్కొన్నారు. స్కూల్ విషయాలను బయటికి చేరవేస్తున్నట్టు తనపై అనుమానంతో ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని రాశారు. మిగతా ఉపాధ్యాయినులను తనతో మాట్లాడకుండా కట్టడి చేశారని ఆరోపించారు. తనకు మెమో ఇవ్వాల్సిందిగా తన స్నేహితులతోనే ప్రిన్సిపాల్ చెప్పారని, ఆ అవమానంతోనే తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. పాఠశాలపై ఆరోపణలు వచ్చిన ప్రతి సారి అధికారులు ప్రిన్సిపాల్ చెప్పే మాటలు నమ్మి నిజాలు తేల్చకుండానే వెళ్తున్నారని సూసైడ్ నోట్‌లో ఉపాధ్యాయిని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయిని జ్యోతి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మైదుకూరు అర్బన్ ఎస్ఐ చిరంజీవి, ఎంఈఓ పద్మలత, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అర్జున్ వేర్వేరుగా పాఠశాల వద్దకు చేరుకుని జరిగిన సంఘటనపై విచారించారు.



కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయిని జ్యోతి

వేధించలేదు.. వివరణ కోరాను : ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల

ఉపాధ్యాయిని జ్యోతి ఆత్మహత్యాయత్నంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.నిర్మల మాట్లాడుతూ తాను ఉపాధ్యాయిని జ్యోతిని వేధించలేదన్నారు. అందరితోపాటు ఆమె జూన్ నెల టీచింగ్ డైరీ సబ్‌మిట్ చేయలేదని తెలిపారు. సోమవారం తనకి తానే తన ఛాంబర్‌లోకి వచ్చి టీచింగ్ డైరీ ఇచ్చారని చెప్పారు. అందులో ఆమె సెలవులో ఉన్న రోజుల్లోనూ, ఆదివారం కూడా పాఠాలు బోధించినట్టు పొందుపరిచారని వివరించారు. దాంతో అలా తప్పుగా ఎందుకు రాశారని అడిగానని దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా కోరానన్నారు. ఉపాధ్యాయినులు ఎవరు ఆ విధంగా చేసినా వివరణ కోరడం మామూలుగా జరుగుతుందని పేర్కొన్నారు. తన ఛాంబర్ నుంచి ఉపాధ్యాయిని జ్యోతి వెళ్లిన కొద్ది సేపటికి సిబ్బంది వచ్చి తాను నిద్ర మాత్రలు మింగానని జ్యోతి మేడమ్ చెబుతున్నారని తనతో అనగా, వెంటనే చికిత్స కోసం తీసుకెళ్లాలని చెప్పానన్నారు. అదే సమయంలో ఆమె భర్త మరికొందరు బయట వ్యక్తులు పాఠశాల వద్దకు వచ్చి ఆమెను ఆటోలో తీసుకెళ్లారని వివరించారు. కాగా ఉపాధ్యాయిని జ్యోతి తన ఛాంబర్ నుంచి వెళ్లిన కొద్దిసేపటికే కింద పడిపోవడం, అదే సమయంలో ఆమె భర్త పాఠశాల వద్దకు చేరుకోవడం అతని వెనకే ఎలాంటి అనుమతి లేకుండా బయటి వ్యక్తులు మోటార్ బైక్‌లపై పాఠశాలలోకి రావడం ఇదంతా ముందుగా వేసుకున్న పథకంగా అనిపిస్తుందన్నారు. పాఠశాలలో జరిగే సంఘటనల వెనుక బయటి వ్యక్తులు ఉన్నారని ప్రిన్సిపాల్ ఆరోపించారు. గతంలో బయటి వ్యక్తులు పాఠశాలలో ఇష్టారాజ్యంగా ఉండేవారని, తాను ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టాక అవన్నీ కట్టడి చేశానన్నారు. ఏదో ఒక విధంగా తనను ఇక్కడి నుంచి పంపించాలని సమస్యలను సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీటీఎంగా ప్రశాంతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్స్ కమర్షియల్)గా ఎంఎస్ ప్రశాంతి బాధ్యతలు స్వీకరించారు. ఈమె పుత్తూరు డిపో మేనేజర్‌గా పనిచేస్తూ కడప జోన్‌కు బదిలీపై వచ్చారు. ఈమె 2010లో వరంగల్ జిల్లా హన్మకొండలో డీఎంగా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత ఉరవకొండ, ధర్మవరం, పుత్తూరులలో పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీటీఎం హరిని వర్క్‌షాప్‌కు బదిలీ చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్సు డిపార్ట్‌మెంట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హత, ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. ఇందులో ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్సు), ఎంటెక్ (కంప్యూటర్ సైన్సు), ఎంటెక్(డేటా సైన్సు)లో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు కంప్యూటర్ డిపార్ట్‌మెంట్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

ఇడుపులపాయకు చేరుకున్న షర్మిల, వైఎస్ విజయమ్మ

వేంపల్లె : పీసీసీ చీఫ్ షర్మిలా, తల్లి వైఎస్ విజయమ్మ సోమవారం ఇడుపులపాయకు చేరుకున్నారు. మంగళవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైయస్సార్ సమాధి వద్దకు ఉదయం 9గంటలకు నివాళులర్పించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వేంపల్లె : వేంపల్లె మండలం నందిపల్లి గ్రామ సమీపంలోని చెరువు వద్ద సోమవారం బైకును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేంపల్లె పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన గంగులయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి బాధితుడిని పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు కొనుగోలు చేయాలని రైతుల నిరసన

ముద్దనూరు : పొగాకు పంటకు తమను ప్రోత్సహించి పంట చేతికొచ్చిన తర్వాత పొగాకును కొనుగోలు చేయలేదని ఓ ప్రైవేటు కంపెనీ తీరుపై పొగాకు రైతులు నిరసన తెలిపారు. ఆదివారం సాయంత్రం పెద్దముడియం మండలం కొండసుంకేసుల గ్రామానికి చెందిన సుమారు 10 మంది రైతులు, చిన్నదుద్యాలకు చెందిన ఓ రైతుతో కలిసి కొత్తపల్లె సమీపంలోని గోడౌన్‌కు సుమారు 420 క్వింటాళ్ల పొగాకును ట్రాక్టర్లలో తెచ్చారు. కంపెనీ ప్రతినిధులు గతంలో చెప్పిన ధర కంటే అతి తక్కువ ధరకు పొగాకును కొనుగోలు చేయడానికి సిద్ధపడ్డారని, అయితే గిట్టుబాటు కాని ధరకు కూడా పొగాకును కొనుగోలు చేయకుండా తమను ఇబ్బంది పెడుతున్నారని పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు పొగాకు లోడుతో వచ్చిన ట్రాక్టర్లను గోడౌన్‌లోనే వదిలి వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మైనుద్దీన్ సిబ్బందితో కలిసి గోడౌన్‌కు చేరుకుని రైతులతో చర్చించారు.

సంక్షేమ ప్రదాత.. అభివృద్ధి విధాత

- వైఎస్సార్ హయాంలో ప్రగతిపథంలో పులివెందుల
- నేడు వైఎస్సార్ జయంతి

పులివెందుల : వైఎస్సార్ హయాంలో పులివెందులలో అభివృద్ధి పరుగులు తీసింది. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి కొరత రాకుండా చూసుకున్నారు. అడగందే అమ్మయినా అన్నం పెట్టదంటారు. అటువంటిది ఏమీ అడగకపోయినా జన్మించిన గడ్డ పులివెందులకు అన్నీ చేసి వైఎస్సార్ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అండగా నిలిచారు. మంగళవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జయమ్మ దంపతులకు రెండో సంతానంగా 1949 జూలై 8న జన్మించారు. గుల్బర్గాలో మెడిసిన్ పూర్తి కాగానే జమ్మలమడుగు క్యాంబెల్ ఆసుపత్రిలో ఏడాదిపాటు వైద్యునిగా సేవలందించారు. అనంతరం పులివెందులలో తన తండ్రి వైఎస్ రాజారెడ్డి పేరుతో 30పడకల ఆసుపత్రిని నిర్మించి పేదలకు ఉచితంగా వైద్యం అందించి వారి మన్ననలు పొందారు. అనంతరం ప్రజలకు మరింత సేవలందించాలన్న తన తండ్రి కోరిక మేరకు రాజకీయాలలో ప్రవేశించారు. 1978లో మొదటిసారిగా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ నుంచి రెడ్డి కాంగ్రెస్ తరపున పోటీచేసి జనతా పార్టీ అభ్యర్థి నారాయణరెడ్డిపై 20,496 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పటినుంచి 2009 వరకు ప్రతిసారి ఎన్నికలలో గెలుస్తూనే ఓటమి ఎరుగని నేతగా చరిత్రలో నిలిచిపోయాడు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, రెండు పర్యాయాలు పీసీసీ అధ్యక్షుడిగా, మూడు పర్యాయాలు సీఎల్పీ నేతగా, నాలుగు పర్యాయాలు పార్లమెంటు సభ్యునిగా, 6 పర్యాయాలు ఎమ్మెల్యేగా ఆయన పదవులు అలంకరించారు.



పట్టణంలోని ఏపీకార్ల్ పరిపాలన భవనం



పులివెందులలోని రింగ్ రోడ్డు

పులివెందుల అభివృద్ధిపై ప్రత్యేక ముద్ర

వైఎస్సార్ ముఖ్యమంత్రి కాగానే పులివెందులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. 30ఏళ్ల నుంచి తనను నమ్మి ఓట్లేసిన పులివెందుల ప్రజల రుణం తీర్చుకునేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పులివెందులలో జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ఫుడ్‌అండ్‌సైన్స్ కళాశాల, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ, ఏపీ కార్ల్, పులివెందుల చుట్టూ రింగ్ రోడ్లు, గోవిందరాజ టెక్స్‌టైల్స్, ఇందిరమ్మ పక్కాగృహాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, బటర్‌ఫ్లై లైట్లు, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఏర్పాటు చేశారు.

బాలిక అదృశ్యం

పోలీసుల అదుపులో అనుమానిత యువకులు



సుమియా (ఫైల్)

వేంపల్లె : వేంపల్లె పంచాయతీ పరిధిలోని పక్కీర్‌పల్లెకు చెందిన సయ్యద్ సుమియా(18) అనే బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన సోమవారం పకీరుపల్లె గ్రామంలో కలకలం రేపుతోంది. తల్లిదండ్రులు మాబువలీ, రమీజా గొర్రె పిల్లలను మేపుకొని జీవనం సాగించుకునేవారు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు సొంత పని ఉండడంతో కుమార్తె సుమియా చింతలమడుగుపల్లె సమీపంలోని బట్లలకోనకు గొర్రెల పిల్లలను మేపుకునేందుకు తీసుకెళ్లింది. సాయంత్రం 5 గంటలైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గుట్టల ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ నరసింహులు, పోలీసు సిబ్బందితోపాటు బాలిక తల్లిదండ్రులు, బంధువులు చుట్టు పక్కల కొండల్లో పరిశీలించినా గొర్రెల పిల్లలు ఉన్నాయి కానీ, బాలిక కనిపించకపోవడంతో అనుమానాలు వ్యక్తం చేశారు. మద్యం తాగుతూ అదే ప్రాంతంలో చింతలమడుగుపల్లెకు చెందిన ముగ్గురు యువకులు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి వాట్సాప్ స్టేటస్‌లో బాలికకు సంబంధించిన వీడియో కనిపించింది. ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపడుతున్నారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాలిక కనపడకపోవడంతో పోలీసు స్టేషన్ వద్దకు పక్కీర్‌పల్లె వద్దకు భారీ సంఖ్యలో వెళ్లారు. బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు.



వేంపల్లె పోలీస్ స్టేషన్ వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

అదృశ్యమైన బాలిక ఆచూకీ తెలపాలంటూ గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టి అద్దాలను, కుర్చీలను విరగ్గొట్టారు. గొర్రె పిల్లలను మేపుకొనేందుకు వెళ్లిన బాలిక సుమీయ అక్కడ స్పృహ తప్పిపోయి రాత్రి 10:30 గంటలకు గొర్ల మంద వద్దకు చేరుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అదృశ్యమైన బాలిక కనిపించడంతో తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. డీఎస్పీ మురళి నాయక్ బాలిక దగ్గరకు వెళ్లి మాట్లాడి తల్లిదండ్రులతో సహా కడప రిమ్స్కు తరలించారు. కాగా గ్రామస్తులు మాత్రం బాలికను చూపించాలని పోలీసు స్టేషన్ వద్ద నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



స్వర్ణ కడప సాధనకు శ్రమిద్దాం

ఇన్‌చార్జిమంత్రి సవిత

కడప సెవెన్‌రోడ్స్ : స్వర్ణ కడప సాధన కోసం అందరూ సమష్టిగా శ్రమించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర–పీ4 ఫౌండేషన్ అమలుపై జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నారు. పీ4 ఫౌండేషన్ ద్వారా బంగారు కుటుంబం–మార్గదర్శి విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. పేదలను అన్ని విధాలా ఉన్నత స్థాయికి తీసుకు వచ్చేందుకు ధనికుల సాయం తీసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో 70 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని వెల్లడించారు. ఆ కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసే బాధ్యత ఉద్యోగులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047లో భాగంగా జిల్లా లక్ష్యాన్ని చేరుకోవడానికి రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధిపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏటా 15 శాతం అభివృద్ధి రేటును పెంచుకుంటూ పోవాలన్నది లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మాధవీరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డితోపాటు జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, సీపీఓ హజరతయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జిమంత్రి సవిత

లింగాలలో పర్యటించిన ఇన్‌చార్జి మంత్రి

లింగాల : పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన లింగాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పర్యటించారు. తమకు తల్లికి వందనం అందలేదని, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మంజూరు కోసం వికలాంగ సర్టిఫికెట్లు అందించలేదంటూ పలువురు మంత్రికి మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ఇచ్చిన హామీలనేకాక మరెన్నో హామీలను నెరవేరుస్తామని చెప్పారు.

మొహర్రం..వైభవం

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మొహర్రం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పెద్దపుత్త, తప్పెట్ల, గంగాయపల్లె తదితర గ్రామాల్లో ఉదయం పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. పీర్లను ఎత్తుకుని యువకులు అగ్ని గుండంలో నడిచారు. పలువురు భక్తులు వారిని అనుసరించారు. సాయంత్రం తిరిగి గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు యువకులు కర్రసాము, నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమాల్లో హిందూ, ముస్లింలు కలిసి పాల్గొని పీర్లకు చక్కెర, పప్పులు, బొరుగులు, బెల్లం తదితర ప్రసాదాలను చదివింపులు ఇచ్చి, ప్రార్థనలు చేసి అందరికీ పంచి పెట్టారు.

ఏడీసెట్ విడుదల చేయకపోవడం వెనుక రాజకీయ కుట్ర

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం ఆర్కిటెక్చర్ అండ్ డిజైనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏడీసెట్) విడుదల చేయకపోవడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఎదుట ఆరు రోజులుగా విద్యార్థులు చేస్తున్న నిరాహార దీక్షలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్యతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ ఈ యూనివర్సిటీకి సీఓఏ పర్మిషన్ వెంటనే ఇవ్వాలన్నారు. ఏడీసెట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఈ ఏడాది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యలను తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్‌కు ఆయన ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

రహదారి నిర్మాణ పనుల అడ్డగింత

జమ్మలమడుగు : విజయవాడ–బెంగుళూరు మీదుగా నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం పనులు భూనిర్వాసితులు అడ్డుకున్నారు. సోమవారం ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు గ్రామంలోని సాయిబాబా గుడి సమీపంలోఉన్న భూమిలో వెంచర్లు వేశారు. తమకు పరిహారం ఇచ్చిన తర్వాతే రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ కొంత మంది వాహనాలకు అడ్డుతగిలారు. దీంతో అధికారులు జోక్యం చేసుకుని త్వరలో వస్తాయని పనులు జరుగనివ్వడంటూ హితవు పలికారు. అయితే గత కొంత కాలంగా ఇటువంటి మాటలే చెబుతున్నారు. ఇంత వరకు తమఖాతాల్లో డబ్బులు జమకాలేదని తెలిపారు. దీనిపై తహసీల్దార్ శోభన్‌బాబుమాట్లాడుతూ ఇంకా 13 మందికి మాత్రమే డబ్బులు జమకాలేదని త్వరలో వీరి ఖాతాలల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పడంతో భూనిర్వాసితులు తాత్కలికంగా నిరసన తెలియజేశారు.

బాబు పాలనలో సంక్షేమం ఊసే లేదు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

జమ్మలమడుగు : చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జమ్మలమడుగు పట్టణం సాయి శివాని కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మూడు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తే చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేవలం ఒక్క ఏడాదిలోనే లక్షా 70 వేల కోట్ల రూపాయల అప్పులు చేసిందన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు అప్పును సృష్టించారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడితప్పి రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఏ కార్యకర్త, నాయకులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అండ ఎప్పుడూ ఉంటుందన్నారు. గతంలో కార్యకర్తలను విస్మరించడంతోనే మనం చేసిన పనులు క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లలేకపోయామని, ఇప్పుడు కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు ఏమిటి.. ప్రస్తుతం ఎన్ని అమలు చేశాడనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. కేంద్రం నుంచి అప్పు రూపంలో తెచ్చిన లక్షా 70 కోట్ల రూపాయలు ఎక్కడిపోయాయని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కేవలం అమరావతి పేరుతో ప్రజా ధనాన్ని కమీషన్ల రూపంతో దండుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

మళ్లీ అధికారంలోకి వచ్చే వరకు ప్రజల్లోనే: ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేంత వరకు కార్యకర్తలు, నాయకులందరూ కలిసికట్టుగా ప్రజల్లోనే ఉండాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్థానంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూర్చోబెట్టడమే మనందరి లక్ష్యం కావాలన్నారు. అందుకోసం బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీని ప్రజా క్షేత్రంలోకి తీసుకెళదామన్నారు. ప్రజల సంక్షేమం పూర్తిగా గాలికి వదిలేసి నాయకులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంతో తమకేమీ సంబంధంలేదు. తమ వాటా తమకు కావాలి అన్న రీతిలో సాగుతున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రవీంద్రనాథరెడ్డిని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోగిడి జయన్న, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర జనల్ సెక్రెటరీ లక్షుమయ్య, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, ముల్లాజానీలు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సునీల్‌కుమార్, రఫీ, పి.గిరిధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మండలాల అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మహాలక్ష్మీ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొమెర్ల మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్లు శివగుర్విరెడ్డి, నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులు కల్పించాలి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు దళితులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండల నాయకులు మధు డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడ ఆయన మాట్లాడారు.



నేడు ఘనంగా వైఎస్సార్ జయంతి

పులివెందుల టౌన్ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మంగళవారం ఉదయం 8గంటలకు స్థానిక పాత బస్టాండ్ (మోర్ సూపర్ మార్కెట్) దగ్గర ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు పార్టీ శ్రేణులు తప్పక హాజరు కావాలని తెలిపారు.వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ, స్థానిక పాత సంత మార్కెట్, కొత్త ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న ఆంజనేయస్వామి, ఆలయాల వద్ద పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మదన్ మోహన్ రెడ్డిలు



పాల్గొంటారని చెప్పారు.

కమలాపురం : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

లింగాల : దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంబకపల్లె బాబురెడ్డి తెలిపారు. ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. పెద్దకుడాల, లింగాల, వెలిదండ్ల, మురారిచింతల గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు ఆయన తెలిపారు.






‘బీమా’ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : ఖరీఫ్–2025లో పంటలు సాగు చేసే రైతులు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం డివిజన్ వ్యవసాయాధికారి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటకోత ప్రయోగాల ద్వారా దిగుబడిని అంచనా వేసి తక్కువ దిగుబడులు వచ్చినట్లుయితే ఫసల్ బీమా, వర్షాలు సరిగా కురవక తక్కువ వర్షపాతం నమోదైతే అపుడు వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుందన్నారు. వేరుశనగ, పత్తి, అరటి, చీనీ పంటలకు వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుందని, ఈ పంటలకు ఈ నెల 15వ తేదీ లోపు బీమా చెల్లించాలని ఆయన వివరించారు. అలాగే కంది, జొన్న, మినుము, పసుపు, ఉల్లి తదితర పంటలకు ఫసల్ బీమా వర్తిస్తుందని, ఈ పంటలకు ఈ నెల 31వ ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉందని తెలిపారు. వరి పంటకు మాత్రం ఆగస్టు 15వ తేదీ వరకు బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.84 ప్రీమియం చెల్లించాలని, కందికి రూ.36, జొన్న కు రూ.38, మినుము కు రూ.38, పసుపుకు రూ.180, ఉల్లికి రూ.90, పత్తికి రూ.2000, వేరు శనగకు రూ.560, చీనీకు రూ.2750, అరటికి రూ. 3025 చొప్పున ప్రీమియం చెల్లించాలని తెలిపారు. బీమా చెల్లించే రైతులు వీఏఏల వద్ద పంట ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు.





పండ్లు అందజేత

పులివెందుల టౌన్ : మున్సిపల్ ఇన్‌ఛార్జి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పులివెందులలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక



కేక్ కట్ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో కౌన్సిలర్ కోడిరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను వైఎస్ మనోహర్‌రెడ్డి కట్ చేశారు. అనంతరం చిన్నారులకు పండ్లను పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధరరెడ్డి పుట్టినరోజు కూడా కావడంతో కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాదర్, పురుషోత్తం, కొంగనపల్లె మురళి, కనక, రాము, బాల అశ్వర్థరెడ్డి, రాజేష్, శ్రీరాములు, యువజన నాయకుడు యశ్వంత్‌రెడ్డి, బండల మురళి, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారానే గృహ నిర్మాణ అనుమతులు

వేంపల్లి : గృహ నిర్మాణాలకు అనుమతులు ఆన్‌లైన్ ద్వారానే పొందాలని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఏపీఓ కృష్ణ సింగ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎల్టీపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఉపచైర్మన్ ఆదితిసింగ్‌ల ఆదేశాల మేరకు మండలంలోని రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణ అనుమతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని పనులు ప్రారంభించాలన్నారు. అనుమతులు ఉంటేనే లే ఔట్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలతోపాటు భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థి రూ. లక్ష విరాళం

లింగాల : లింగాల మండలం పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ బడిలో 1984–85 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి, రామసున్నూతనపల్లె గ్రామానికి చెందిన రాజగోపాల్‌రెడ్డి సోమవారం లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. నెల రోజుల క్రితం పాఠశాలలో ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామి ఇచ్చారు. ఆ మేరకు సోమవారం హెచ్ఎం, ఎంఈఓ–2 రామకృష్ణయ్య, ఉపాధ్యాయులకు లక్ష రూపాయల నగదును అందజేశారు. ఈ నగదును డెస్కులు, ఫర్నీచర్ తయారీ కోసం వినియోగించాలని ఆయన సూచించారు. రాజగోపాల్‌రెడ్డిని ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు.



